రహదారులు అగమాగం.. ప్రయాణం ప్రమాదకరం..

జనగామ జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన రహదారులు నిర్వహణ లోపంతో అధ్వానంగా మారుతున్నాయి. హైదరాబాద్ రోడ్డు వైపు రహదారి పక్కనే శిథిలాలు ఉన్నా తొలగించకపోవంతో ఇబ్బందికరంగా మారాయి. రహదారి మధ్యలో యూటర్న్‌ల వద్ద తారు వేయకపోవడంతో లోతుగా మారి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేయాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. – జనగామ టౌన్, న్యూస్‌టుడే


యూటర్న్ వద్ద తారు వేయని దృశ్యం


జనగామ ప్రధాన రహదారి వెంట శిథిలాలు

భువి నుంచి దివికెగిసినట్టు!



నింగి, నేల ఏకమవ్వడం అసాధ్యం. కానీ ఈ చిత్రం మాత్రం సుసాధ్యం చేస్తున్నట్టుగా ఉంది కదూ.. భూతలంలోని నీటిపై దివిలోని ఎర్రటి సూర్యాస్తమయ కాంతి పడడంతో నింగి, నేల ఏకమైనట్లు ఆకట్టుకుంటున్న ఈ దృశ్యం నెల్లుట్ల చెరువు వద్ద శుక్రవారం సాయంత్రం కనిపించగా 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. – జనగామ అర్బన్, న్యూస్‌టుడే

గాయత్రీదేవి రూపంలో అమ్మవారు

శ్రీ దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. – న్యూస్‌టుడే, బృందం


పాలకుర్తి సోమేశ్వరాలయంలో..


జఫర్‌గఢ్‌లో..


జనగామ: గణేశ్‌వాడలో ప్రత్యేక పూజలో పాల్గొన్న డీసీపీ రాజమహేంద్రనాయక్, సీఐ దామోదర్‌రెడ్డి..


జనగామ: బతుకమ్మకుంటలో..


రఘునాథపల్లి శ్రీ మహాదేవస్వామి దేవస్థానంలో..


పాలకుర్తి: గౌడకాలనీలో..


బచ్చన్నపేటలో..

ఆర్థిక ఇబ్బందులతో పథకాలు అమలు చేయలేకపోతున్నాం..


స్టేషన్‌ఘన్‌పూర్‌లో చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులతోనే ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయలేకపోతున్నామని.. త్వరలోనే ఒక్కొక్కటిగా అమలు చేస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని మండలాలకు చెందిన 71 మంది లబ్ధిదారులకు రూ.19,54,500 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గంలో వెయ్యి మంది లబ్ధిదారులకు రూ.పది కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ వంటి ఎలాంటి పథకమైనా దరఖాస్తు చేసుకున్న మూడు నెలల్లోనే సాయం అందించడం జరుగుతుందని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నియోజకవర్గానికి 5 వేల ఇళ్లు వస్తాయని.. లబ్ధిదారుల ఎంపిక గ్రామ స్థాయిలోనే ఇందిరమ్మ కమిటీల ద్వారా జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో అక్రమ కట్టడాలను కూల్చివేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సతీష్, ఎల్లయ్య, కుమారస్వామి, సురేష్ పాల్గొన్నారు.

గర్భిణిపై ఎంసీహెచ్ వైద్యుల నిర్లక్ష్యం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: గర్భిణిగా ఉండి పుట్టింట్లో ఉంటున్న ఓ మహిళ పరీక్షల కోసం జనగామ ఎంసీహెచ్‌కు వెళ్తే ఆమెకు ఓపీలో పరీక్ష చేయకుండా వైద్యులు తిప్పి పంపిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. జనగామకు చెందిన శృతికి యాదగిరిగుట్టకు చెందిన వ్యక్తితో వివాహమైంది. గర్భం దాల్చాక ఆమె జనగామలోని పుట్టింటి ఇంటికి వచ్చింది. పరీక్షల కోసం జనగామ ఎంసీహెచ్ ఆసుపత్రికి వెళ్లి ఓపీలో ఆధార్ కార్డుతో నమోదు చేయించుకోవడానికి వెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది జనగామలో స్థానికత లేదని, యాదగిరిగుట్టలో స్థానికత ఉన్నందున భువనగిరిలో చూపించుకోవాలని ఓపీలో పరీక్షించడానికి నిరాకరించారు. తాను పుట్టింది ఇక్కడేనని, తన పుట్టిల్లు అయిన జనగామ ఆసుపత్రిలో తనకు పరీక్షలు ఎలా చేయరని గర్భిణి శృతితో పాటు కుటుంబ సభ్యులు పట్టుబట్టినా వైద్య సిబ్బంది వినలేదు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆసుపత్రిలో గైనకాలజీ వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, ఆలేరు, భువనగిరి నుంచి వచ్చే గర్భిణులకు నెలలో దాదాపుగా 80 కాన్పులు చేస్తున్నట్లు తెలిపారు. ఓపీలో చూడమని వైద్యులు చెప్పలేదని, ప్రస్తుతం సదరు గర్భిణిని అడ్మిట్ చేసుకున్నట్లు వివరించారు.


పండగలకు అదనపు బస్సులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: బతుమకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ఈ నెల 1 నుంచి 11 వరకు జనగామ డిపో నుంచి పలు రూట్లకు ప్రత్యేకంగా అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు డీఎం స్వాతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ నుంచి హైదరాబాద్, ఉప్పల్, జగద్గిరిగుట్టకు ప్రతి రోజూ అదనంగా బస్సులను నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతు ధర్నా విజయవంతం..
భారాస శ్రేణుల్లో ఉత్తేజం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు మహాధర్నా విజయవంతం కావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. వేలాదిగా తరలివచ్చిన రైతులతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలుచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు ప్రసంగించారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై పార్టీ నాయకులు


సభకు హాజరైన రైతులు

☛ రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంటూ బోగస్ మాటలు చెప్పిన మోసకారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 11 పర్యాయాలు రూ.72 వేల కోట్ల రైతుబంధును అందించిన ఘనత భారాస ప్రభుత్వానికే దక్కుతుంది.
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

☛ తొర్రూరులో గురువారం ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో వేదిక కూలిపోయిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడి వేటాడుతాం.
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి

☛ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డిలు పొంతనలేని లెక్కలు చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

☛ నేటికి 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆసుపత్రి పనుల ఊసేలేదు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటాం.
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పారిశుద్ధ్య కార్మికుల పనితీరు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, జడ్పీ సీఈవో సరిత, డీపీవో స్వరూప

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన పనితీరు అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛత హీ సేవ పక్షోత్సవాల ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాలనాధికారి పాల్గొని ప్రసంగించారు. నిత్య శ్రామికులు పారిశుద్ధ్య కార్మికులని, వారు చేసిన సేవల వల్లనే స్వచ్ఛతలో రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 1200 మంది మల్టీపర్పస్ కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించామన్నారు. ఉపాధి హామీ పనుల్లోనూ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. స్త్రీనిధి రుణాల రికవరీకి సంబంధించి రూ.3కోట్లు వసూలు చేసి చివరి ఐదో స్థానంలో ఉన్న జిల్లాను టాప్-10లోకి తీసుకురావడంలో కృషి చేసిన ఏపీఎంలు, సంబంధిత అధికారులను అభినందించారు. అనంతరం ప్రతీ మండలానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేసిన పారిశుద్ధ్య కార్మికులకు, రుణాల రికవరీలో కృషిచేసిన వీవోలు, ఏపీఎంలను కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, జడ్పీ సీఈవో సరిత, డీపీవో స్వరూప, డీఆర్డీవో పీడీ వసంత, డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ కరుణాకర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మరో 8 నెలల్లో సరస్వతి పుష్కరాలు

కవుల రాగమై .. జీవన గానమై..!

వివరాలు 6లో..

ఏసీబీ అధికారులమంటూ బెదిరింపులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ఏసీబీ అధికారులమని, అడిగినంత ఇవ్వకుంటే ఏసీబీ దాడులు చేసి జైలుకు పంపిస్తామంటూ పలువురు జిల్లా అధికారులకు సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కలెక్టరేట్‌లోని ఓ శాఖకు చెందిన అధికారికి ఫోన్ చేసి 'నీ మీద అవినీతి ఆరోపణలు వచ్చాయని, మేము దాడులు జరపకుండా ఉండాలంటే రూ.50వేలు ఇవ్వాల'ని డిమాండ్ చేశారు. దీనికి ఆ అధికారి నేనెలాంటి అవినీతికి పాల్పడలేదని, ఎలాంటి ఎంక్వైరీ చేసినా తాను ఎదుర్కొంటానని ధీటుగా చెప్పి ఫోన్ పెట్టేశాడు. కలెక్టరేట్‌లోని మరొక శాఖకు చెందిన అధికారితో ఓ సంస్థకు సంబంధించిన గుర్తింపు విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని, సమస్య పెద్దది చేసుకోకుండా ఎంతోకొంత ఇచ్చి సెటిల్ చేసుకుందామని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ అధికారి తాను ఎలాంటి తప్పు చేయలేదని చెప్పడంతో నేరగాడు వెంటనే ఫోన్ పెట్టేశాడు. దీంతో ఆ బాధితుడు స్థానిక పోలీసులతో పాటు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్యకు సమాచారం ఇచ్చినట్లు సమాచారం.

ఉద్యోగాల భర్తీపై కలెక్టర్ ఆరా

ఈనాడు కథనానికి స్పందన

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇచ్చే విషయంలో జాప్యం చేస్తున్న తీరుపై 'వైద్యశాఖ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో గందరగోళం' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా స్పందించారు. ఈనాడు కథనాన్ని చూసిన పాలనాధికారి నియామక ఉత్తర్వులను అభ్యర్థులకు ఇవ్వడంలో ఎందుకు జాప్యం అవుతుందంటూ డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలతో శనివారం నియామక ఉత్వర్వులు ఇవ్వనున్నట్లు సమాచారం.

బాలికలపై అత్యాచారం కలకలం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని పునరావాస కేంద్రం నుంచి తప్పించుకుని జనగామకు వచ్చిన ఇద్దరు బాలికలపై జనగామలో ఐదుగురు యువకులు అత్యాచారం చేసిన ఘటన శుక్రవారం వెలుగుచూసిన విషయం విదితమే. అత్యాచారానికి పాల్పడిన జనగామకు చెందిన ఐదుగురు యువకులను హైదరాబాద్‌లోని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు బాలికలపై వారు అత్యాచారానికి ఒడిగట్టిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 24న హైదరాబాద్ నుంచి తప్పించుకుని వచ్చిన ఆ బాలికలపై అదే రోజు రాత్రి యువకులు అత్యాచారం చేసినట్లుగా వెల్లడైంది. 25న బస్టాండ్‌లో ఉన్న ఇద్దరు బాలికలను పట్టణ ఎస్సై శ్వేత గమనించి వారి వివరాలు తెలుసుకుని తమకు అప్పగించినట్లు జనగామ సఖి కేంద్రం ఇన్‌ఛార్జి రేణుక 'న్యూస్‌టుడే'కు తెలిపారు. 26వ తేదీన తెల్లవారుజామున సైదాబాద్ పోలీసులకు ఇద్దరు బాలికలను అప్పగించినట్లు ఆమె చెప్పారు.


ఆశ్రయం కల్పిస్తామని నమ్మించి.. ఆపై వంచించి..

హైదరాబాద్ నుంచి వచ్చిన ఇద్దరు బాలికల్లో ఒకరు బస్టాండ్ దగ్గరలోని ఓ పాన్ షాపు నిర్వాహకుడి నుంచి ఫోన్ తీసుకొని తెలిసిన వారికి ఫోన్ చేయగా, ఆయన తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. మరో బాలికను పాన్ షాపు నిర్వాహకుడు ఆశ్రయం కల్పిస్తామని చెప్పి దగ్గరలోని ఓ బేకరీకి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. తర్వాత మరో బాలిక అక్కడికి రాగా, ఇద్దరినీ హైదరాబాద్ తీసుకెళ్తామని చెప్పి నిర్వాహకుడు తన స్నేహితులతో కలిసి కారులో పలు మార్లు అత్యాచారం చేశారు. తర్వాత జనగామ బస్టాండ్‌లో ఇద్దరిని విడిచిపెట్టగా, అనుమానాస్పదంగా ఉన్న బాలికల తీరుతో విషయాలు వెలుగుచూశాయి. బేకరీల్లో బర్త్‌డే పార్టీలు, ఇతరత్రా అసాంఘిక కార్యక్రమాలు సైతం చేస్తున్నట్లు ఈ ఘటనతో తేలింది. అలాగే పట్టణంలోని కొన్ని లాడ్జిల్లో మైనర్లయిన అమ్మాయిలు, యువకులకు గంటల చొప్పున అద్దెకు ఇస్తూ చట్ట వ్యతిరేకంగా కొందరు లాడ్జిల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు ఇకనైనా తనిఖీలు ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీలో మహాలక్ష్మి!



● సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర



ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం రెట్టింపయ్యింది. అధికారులు సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉత్తమ సేవలతో పాటు మంచి లాభాలు ఆర్జించడంలో మహిళా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కండక్టర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని విభాగాల్లో సత్తా చాటుతున్నారు.

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల పరిధిలో మహిళా కండక్టర్లు 479 మంది ఉన్నారు. ఇతర విభాగాల్లో పని చేసే వారు మరో 32 మంది ఉంటారు. వీరిలో ప్రధానంగా వరంగల్ 2, జనగామ, తొర్రూరు, నర్సంపేట డిపో మేనేజర్లు జ్యోత్స్న, స్వాతి, పద్మావతి, ప్రసూనలక్ష్మి, వరంగల్ 2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, హనుమకొండ డిపోలో నాజియా, ఆర్‌ఎం కార్యాలయంలో సరస్వతి, పరకాలలో కృష్ణకుమారి, నర్సంపేటలో భవానీ, తొర్రూరులో రజిత, ఎంఫ్‌లు వరంగల్ 2 డిపోలో అమల, పరకాలలో రాజశ్రీ, ఆర్‌ఎం కార్యాలయంలో మహిళలు కీలక పదవుల్లో ఉండి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.



మహిళా శక్తి ఇలా..

● పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువ మంది మహిళా కండక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు.

● ఆర్టీసీలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉన్నతాధికారులు ప్రతి డిపోకు ఇద్దరు సభ్యులతో కూడిన సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని 9 డిపోల్లో ఒక పురుషుడితో పాటు ఒక మహిళ సభ్యులుగా ఉన్నారు. తొర్రూరు, పరకాల, వరంగల్ 2, జనగామ డిపోల్లో ఇద్దరు సభ్యులు మహిళలే ఉన్నారు. వీరు డిపోల స్థాయిలో కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం, ఆర్‌ఎంలకు చేరవేసి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారు.

● రీజియన్‌లో మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రతి డిపోలో ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి డిపోలో ఇద్దరు సహాయకులు సైతం ఉంటారు. వీరు మహిళా సిబ్బందికి వారానికి, నెలకోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి హనుమకొండలోని డిస్పెన్సరీ నుంచి మందులు, తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో అధునాతన చికిత్స అందించేలా కృషి చేస్తున్నారు.



వరంగల్ 1 డిపోలో మహిళల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గది

ఈ సేవలు అందిస్తే మేలు

● రోజుకు 8 గంటల పని దినం కల్పించాలి
● రాత్రి 8 గంటల వరకు తప్పని సరిగా విధులు ముగిసేలా చర్యలు తీసుకోవాలి.
● ప్రతి నెలా ఆరోగ్య సమస్యలకు మూడు రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి.
● పని ఒత్తిడి నివారణకు సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచాలి.
● సిటీ బస్సుల్లో మాదిరిగా స్టాండింగ్ అలవెన్స్‌లు అందించాలి.
● స్పెషల్ ఆఫ్ డ్యూటీ (ఒక రోజు విధులు నిర్వహిస్తే మరో రోజు సెలవు వచ్చేలా) విధులు కేటాయించాలి.

ఉన్నతాధికారుల సహకారంతో ..



- జ్యోత్స్న, డిపో మేనేజర్, వరంగల్ 2

ఆర్టీసీ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తున్నాం. వారి సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. మహిళా సిబ్బంది పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తూ డిపో అభివృద్ధికి పాటు పడుతున్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.



- బి.సుధారాణి, కండక్టర్ వరంగల్ 1

మహాలక్ష్మి పథకం వచ్చాక బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో కొంత ఒత్తిడితో పాటు అనారోగ్యానికి గురవుతున్నాం. అయినప్పటికీ సంస్థను తమ సొంతంగా భావించి దాని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రద్దీని తట్టుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. మా డిపో మేనేజర్ సూచనలతో ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నాం.

పనిభారం ఉన్నా సమర్థంగా విధులు



- రజిత, ట్రాఫిక్ ఎస్టీఐ, తొర్రూరు డిపో

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో మహిళా కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నారు. పని భారం పెరుగుతున్నా సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేస్తున్నారు. సంస్థ లాభాల్లో వారి కృషి కీలకం.



త్రివేణి సంగమం

● మరో 8 నెలల్లో

సరస్వతి పుష్కరాలు

● ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తే మేలు

న్యూస్‌టుడే, కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర క్షేత్రం వద్ద అంతర్వాహినిగా పేరున్న సరస్వతి నదికి మరో ఎనిమిది నెలల్లో పుష్కరాలు రాబోతున్నాయి. ప్రతి పన్నెండేళ్లకోసారి వచ్చే సరస్వతి పుష్కరాలు వచ్చే ఏడాది మే 15 నుంచి 26 వరకు జరుగుతాయి. 2013లో ఈ నదికి పుష్కరాలు జరిగాయి. కాళేశ్వరం క్షేత్రంలో మూడు నదులు కలుస్తాయి. దీన్ని త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఎగువ నుంచి గోదావరి, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదుల ప్రవాహం రాగా కాళేశ్వరాలయంలోని ద్విలింగాలకు జలాభిషేకం చేసిన నీరు అంతర్వాహినిగా రెండు నదుల్లో కలుస్తుందని పురాణాల్లో ఉంది. 2015లో గోదావరి, 2022లో ప్రాణహిత పుష్కరాలు జరిగాయి. మరోనది సరస్వతికి పుష్కర కాలం సమీపించింది. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాల్లో గోదావరి, ప్రాణహిత కలయిక ప్రవాహంలో లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈసారి మరో 8 నెలల సమయమే ఉన్నందున అటు దేవస్థానం అధికారులు, ఇటు ఇతర అధికారులు ముందస్తు ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించొచ్చు.

పూర్తి చేయాల్సిన పనులు..

● గత ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. నిధుల లేమితో నిర్మాణాలు ఆగిపోగా పంచాయతీరాజ్ అధికారులు గతేడాది అక్టోబర్‌లో మరో రూ.1.5 కోట్ల కోసం జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. ఇది అందుబాటులోకి వస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.



అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం

● 2013 సరస్వతి పుష్కరాల సమయంలో ప్రయాణ ప్రాంగణం నుంచి గోదావరి వరకు ప్రధాన రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ప్రాణహిత పుష్కరాలకు ముందు ఏర్పాట్లు జరిగినా కొందరు అడ్డు తగలడంతో ఆగిపోయింది. మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుంటే విస్తరణ పనులు సకాలంలో పూర్తయి భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడదు. మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వర క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పలుమార్లు హామీలిచ్చారు. పుష్కరాల నేపథ్యంలో అధికారులు వెంటనే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక నివేదించాలి. తదనుగుణంగా సకాలంలో పనులను పూర్తి చేయడానికి వీలు కలుగుతుంది.

● ప్రముఖుల ఘాట్ వద్ద అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహించి రెండు నదుల్లో కలుస్తుందని నానుడి ఉంది. ఆ ప్రాంతంలో పుష్కర ఘాట్ నిర్మాణాలు చేపట్టాలి.

● మండు వేసవిలో పుష్కరాలు రానుండగా భారీ సంఖ్యలో గోదావరి తీరంలో, ఆలయ పరిసర ప్రాంతాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి.


● ప్రధాన ఆలయానికి సమీపంలోని గుండం చెరువును ఆధునికీకరిస్తామని పలుమార్లు నాయకులు చెబుతున్నా పనులు సాగడం లేదు. వెంటనే గుండం చెరువును మినీ ట్యాంక్‌బండ్ మాదిరిగా నిర్మాణాలు చేపట్టాలి.

విస్తృత ప్రచారం జరగాలి

సరస్వతి నది పుష్కరాలపై దేవస్థానం అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉంది. దేశం నలుమూలల తెలిసేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం జరగాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. గత మంగళవారం పుష్కర ఏర్పాట్లపై దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్, కమిషనర్ హన్మంతరావు సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో పనుల పురోగతిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 2013లో జరిగిన సరస్వతి పుష్కరాలకు మొదటి నాలుగు రోజులు భక్తుల సంఖ్య కేవలం వందకు పరిమితం కాగా అయిదో రోజు నుంచి పుంజుకొని వేల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. రాబోయే పుష్కరాలపై ఇప్పటి నుంచే ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు, రేపు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హనుమకొండ బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతి

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి లభించింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.శిరీష పదోన్నతిపై సికింద్రాబాద్ సిటీ సివిల్ న్యాయస్థాన ప్రాంగణంలోని 14వ అదనపు కోర్టు జడ్జిగా వెళ్తున్నారు. ములుగు జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి మంచిర్యాల జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్నారు. జనగామ సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రం అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో జనగామ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత పదోన్నతిపై వస్తున్నారు. వరంగల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్ అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్ పదోన్నతిపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో హనుమకొండ మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి జాబిశెట్టి ఉపేందర్‌రావు వస్తున్నారు. రంగారెడ్డి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.ఉషాక్రాంతి పదోన్నతిపై హనుమకొండ జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌రావు చందన హనుమకొండ జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత



మరిపెడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి (73) శుక్రవారం కన్నుమూశారు. మరిపెడ మండలం పురుషోత్తమయాగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి వారం రోజుల క్రితం గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డోర్నకల్ శాసనసభ నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ప్రధాన ప్రత్యర్థిగా రాజకీయాల్లో కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో భారాసలో చేరారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● పురుషోత్తమాయగూడెంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నరేష్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు సంతాపం ప్రకటించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కవుల రాగమై .. జీవన గానమై..!

● బతుకమ్మ పాటల్లో గొప్ప సందేశం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే అత్యంత పవిత్రమైన పండగ బతుకమ్మ. మహిళలంతా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పూజిస్తూ.. ఆటపాటలతో మురిసిపోతారు. ఆ పాటల వెనుక ఎంతో అర్థముంది. ఇవి జానపదాలతో పాటు కవులు, గాయకుల కలం నుంచి జాలువారి ప్రజలను అలరిస్తున్నాయి.. పాటల చరణాల్లోని బావుకత, పూల సొగసుల వర్ణన, జీవన పరమార్థం, ప్రకృతి దేవతల ఆరాధన, సందేశాలు.. ఇలా ఎన్నో దాగి ఉన్నాయి.. మానుకోట, న్యూస్‌టుడే



హనుమకొండ భీమారంలోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఆప్యాయత..

**మా ఇంటి ఆడపడుచువు
అమ్మా.. ఓ బతుకమ్మా
మా పల్లె పూల జల్లువు
అమ్మా.. బతుకమ్మా..
తెలంగాణ మురిసె..
మా చెల్లెలంతా.. మా అక్కలంతా.. మా అమ్మలంతా
బతుకమ్మలాడా..'**



- మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు గోడిశాల జయరాజు ఈ పాట రాశారు.

● తన పాటలో బతుకమ్మ వేడుకల వేళ ఆడపడుచుల ఆనందాన్ని.. పూల పర్వదిన సౌందర్యాన్ని వర్ణించారు.

పూల తహతహ..!

**'బతుకమ్మ పండగొస్తే
పూవులన్నీ నవ్వుతాయి..
గడ్డిపూలు గంతులేస్తయ్.. తంగేడు
పూలు తెంపమంటయ్
నునుపుగున్న గునుగు పూలు
గుసగుసలు చెబుతాయి
చెరువులోని తామరలు
తెంపమంటూ తొంగుతాయి
బతుకమ్మ పండుగొస్తెరా.. మా పల్లె తల్లి
పుత్తడి బొమ్మయి పోవురా..
నా తెలంగాణ తల్లి పుత్తడి బొమ్మయి పోవురా..**



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గాయకుడు, గేయ రచయిత కందుల ప్రేంకుమార్ ఈ పాట రాశారు.

● ప్రకృతిలోని రంగు రంగుల పూలు బతుకమ్మలో తమను కూడా చేర్చాలని.. పేర్చాలని.. కోరుకుంటాయని ప్రేంకుమార్ పూల తహతహలను వర్ణించారు. ఒక్కో పువ్వును వర్ణించారు.

ఊరువాడ కలిసేలా..



**'సింగిడిలో.. సింగిడిలో
రంగులన్నీ నేలకొచ్చేనా..
రంగు రంగు పువ్వులయి
ఏకమయ్యేనా.. చెరువంతా
మెరిసేనా..
ఊరువాడా కలిసి.. బతుకమ్మలా పేర్చి
ముత్తయిదువులంతా కలిసి గౌరమ్మను కొలిసెనే..
అందాల పూవులన్నీ ఊయలలూగెనా
మందార పూలన్నీ కోలాటమాడెనా
తామర పువ్వులన్నీ తనువు తడిసెనా
గులాబీ పువ్వులన్నీ పొద్దయిపొడిసెనా
ఊరువాడా కలిసి మొక్కులన్నీ తీర్చి..**

● మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, గాయకుడు అక్షరం ప్రభాకర్ బతుకుతెరువునిచ్చే బతుకమ్మ అంటూ పాటలు రాశారు. నింగిలోని ఇంద్రధనుస్సు బతుకమ్మను చూడడానికి ఒక్కొక్క పూవుగా నేలకు వచ్చినట్లు ఈ పాటలో వివరించారు. పండగ వేళ ఊరంతా ఎలా ఆనందంలో తేలిపోతారో తెలియజేశారు.

సామూహిక అత్యాచార నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులను ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అరెస్టు వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్ కుమార్, పుట్టపాక శరత్ స్నేహితులు. శరత్ ద్వారా బాధిత యువతి మూడు సంవత్సరాల క్రితం శివరాజ్‌కుమార్‌కు పరిచయమైంది. నర్సంపేట లక్నేపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కొడం వివేక్ బీటెక్ చదువుతున్నారు. ప్రధాన నిందితుడు శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కూచన మణిదీప్ కుటుంబాల మధ్య స్నేహం ఉంది. ఈక్రమంలో శివరాజ్‌కుమార్ ఇటీవల బాధిత యువతికి తన ప్రేమ విషయాన్ని తెలుపగా ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది. దీంతో యువతిని ఎలాగైనా శారీరకంగా లోబరుచుకోవాలని శివరాజ్‌కుమార్ ఆలోచించాడు. గత నెల 15న శివకుమార్, వివేక్‌లను కలవడానికి మణిదీప్ బిట్స్ కళాశాలకు వచ్చాడు. ముగ్గురు కలిసి ఉండగా శివకుమార్ తన కోరికను వెలిబుచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి నగర శివారులో యువతి చదువుతున్న కళాశాలకు వచ్చారు. బాధిత యువతికి శివరాజ్‌కుమార్ ఫోన్ చేసి గుడికి వెళ్దామని చెప్పి కారులో ఎక్కించుకున్నారు. అప్పటికే కారులో మరో ఇద్దరు యువకులు మణిదీప్, వివేక్‌లను చూసి గుడికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను బలవంతంగా ఎక్కించుకున్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని ఓ మద్యం దుకాణంలో బీర్లు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వరంగల్ కూరగాయల మార్కెట్ వద్ద గల ఓ లాడ్జికి తీసుకెళ్లారు. యువతికి మద్యం తాగించి లాడ్జిలో ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి అరుపులతో లాడ్జి సిబ్బంది వచ్చి ప్రశ్నించగా గది నుంచి యువతి, ముగ్గురు యువకులు వెళ్లిపోయారు. అత్యాచారం విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని ఆమెను బెదిరించారు. కళాశాలలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లిన యువతి అత్యాచారం విషయాన్ని తల్లికి చెప్పగా ఈ నెల 1న ఇంతేజార్‌గంజ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గురువారం నర్సంపేట మహేశ్వరం వెళ్లే ఓ కచ్చా రోడ్డు వద్ద ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. మణిదీప్‌కు చెందిన కారు, మూడు చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సార్వత్రిక పది, ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: 2024-25 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్)లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా http:///www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) ఖాళీగా ఉన్న ఒక్కొక్క ఏఎన్ఎం పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 7 నుంచి 15వ తేదీలోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. కనీస విద్యార్హతలు అవసరమని చెప్పారు.

అంగన్‌వాడీ చిన్నారులకు 'రాగిజావ' కానుక

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1వ తేదీ నుంచి రాగిజావ అందించనుంది. సద్గురు మధుసూదన్ సాయి సారథ్యంలో బడి 40 శాతం ప్రభుత్వ ఆర్థిక మద్దతుతో కేంద్రాల చిన్నారులకు రాగిజావ అందించనుంది. ఇందుకోసం నాణ్యత గల రాగి పొడి, బెల్లం సేకరించి పొట్లాలుగా తయారుచేసి దీపావళి కానుకగా సరఫరా చేయడానికి సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి..

☛ కేంద్రాలకు వెళ్లే చిన్నారులకు సరైన పోషకాలు అందడం లేదని గ్రహించిన నేపథ్యంలో పోషక విలువలున్న జావ అందించనున్నారు. ఇందుకోసం కిలో చొప్పున పొట్లాలు తయారుచేస్తున్నారు. ప్రతి విద్యార్థికి పది గ్రాముల చొప్పున రాగిపొడి బెల్లం వేడినీళ్లలో కలిపి అందించనుంది. ఇందులో పసుపు, బియ్యపు పిండి, దాల్చిన చెక్క సహా ఏడు రకాల ధాతువులను కలిపి చిన్నారులకు ఇస్తారు.

☛ అలాగే విద్యార్థులు ఇంటికి వెళ్లే క్రమంలో వేడినీళ్లలో బెల్లంతో కూడిన ద్రావణాన్ని తాగించాలి. తీయదనంతో ఇష్టంగా తాగుతారని నిపుణులు చెపుతున్నారు.

☛ ప్రతినెలా 15వ తేదీకల్లా మండలాల వారీగా కేంద్రాల విద్యార్థుల సంఖ్యను సేకరించి సరకుల రవాణాను మండల వనరుల కేంద్రాలకు తరలిస్తారు. అక్కడి నుంచి విద్యాలయాల బాధ్యులు తమ ప్రాంతాలకు తరలించాలి.

వారానికి మూడు రోజులు రాగి జావ..

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో గత రెండు నెలలుగా నిలిచిపోయిన రాగిజావ సరఫరాను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిరుటి విద్యాసంవత్సరం వరకే ఒప్పందం ఉన్నా విద్యార్థులు ఇబ్బంది పడొద్దని జూన్, జులై మాసాల్లో నిర్వాహకులు అందించారని సమాచారం. పలు విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం వెంటనే వారానికి మూడు రోజుల పాటు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ద్వారా అందించాలని ఆదేశించింది. దసరా సెలవుల అనంతరం ఇవ్వనున్నట్లు సమాచారం.

పోషక విలువలు ఇలా..

ప్రతి వందగ్రాముల రాగుల్లో 328 క్యాలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీ గ్రాములు, 11 మి.గ్రా. సోడియం, 344 మి.గ్రా. క్యాల్షియం, 408 మిల్లీ గ్రాముల పొటాషియం ఉంటాయి. చిన్నపిల్లల ఎముకలు ధృడంగా ఉండడానికి క్యాల్షియం, రక్త హీనత తగ్గించడానికి పీచు పదార్థాలు ఉండడంతో విద్యార్థి ఉత్సాహంగా ఉంటారని నిపుణులు చెప్పారు.



సిద్ధమవుతున్న పొట్లాలు



దసరా సెలవుల నాటికే సన్నాహాలు పూర్తి చేస్తాం..

- ఆనంద్ కడాలి, ప్రధాన కార్యదర్శి, శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు

రాగిజావ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో 21 లక్షల మందికి రాగిజావ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దసరా సెలవులు పూర్తయ్యే నాటికి లాంఛనాలు పూర్తిచేసి నవంబర్ ఒకటి నుంచి సరఫరా చేస్తాం. నిత్యం అనుశీలన చేస్తాం. ఏ ఒక్క విద్యార్థి ఆకలితో బడికి రావొద్దన్నది ట్రస్టు ప్రధాన ధ్యేయం. దాతల సహకారంతో నిర్వహిస్తుండటం గొప్ప సంతృప్తినిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెంలోని ఎస్సీ కాలనీలో నాలుగు రోజులుగా నల్లాల ద్వారా మురుగు నీళ్లు రావడంతో ఇబ్బందులు పడుతున్నాం.
- శోభన్‌బాబు, వడ్డెగూడెం.

సమాధానం: పైపులైన్‌ను పరిశీలించి మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
- రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి, జఫర్‌గఢ్.

జఫర్‌గఢ్: కోనాయచలం నుంచి కూనూర్ వరకు రహదారుల వెంట ముళ్ల చెట్లు అల్లుకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. **-గ్రామస్థులు**

సమాధానం: రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించే చర్యలు చేపడుతాం.. **-రామేశ్‌చంద్ర, పీఆర్ ఏఈ, జఫర్‌గఢ్.**

పాలకుర్తి: మండలంలోని తొర్రూరు గ్రామంలో మురుగుకాల్వలు చెత్తచెదారంతో అపరిశుభ్రంగా మారాయి. దుర్వాసన వ్యాపిస్తోంది. **- గణేష్, గ్రామస్థుడు**

సమాధానం: సిబ్బందితో శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటా. **- రాములు, ఎంపీడీవో, పాలకుర్తి**

మాజీ మంత్రికి ఘన స్వాగతం



నెల్లుట్లలో హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న భారాస శ్రేణులు

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎలాంటి షరతులు లేకుండా పంట రుణమాఫీ చేయాలని తొర్రూర్‌లో చేపట్టిన రైతు ధర్నా కార్యక్రమానికి హరీశ్‌రావు వెళ్తుండగా నెల్లుట్ల వద్ద మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆధ్వర్యంలో భారాస మండల నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గండి యాదగిరి, రాంచందర్, యాకన్న, లింగమూర్తి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వివరాలను నమోదు చేసుకోండి



మాదారంలో కుటుంబ డిజిటల్ సర్వేలో పాల్గొన్న ఆర్డీవో కొంరయ్య

రఘునాథపల్లి: ప్రభుత్వం చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం జనగామ ఆర్డీవో కొంరయ్య తనిఖీ చేశారు. మండలంలోని మాదారంలో శుక్రవారం సర్వే తీరును పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు. కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీఎల్పీవో వెంకట్‌రెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

చెరువు తూము లీకేజీకి మరమ్మతులు



చెరువు తూము వద్ద మట్టి పోయిస్తున్న రైతులు

ఈనాడు కథనానికి స్పందన

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్‌లోని పెద్ద చెరువు తూము వద్ద గండిపడి నీళ్లు వృథాగా పోతున్నాయి. సాగుకు నీరు అందని పరిస్థితి నెలకొనగా.. సమస్యపై సెప్టెంబర్ 7న 'తూము లీకేజీతో.. నీటి వృథా' కథనం ప్రచురితమైంది. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడంతో గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం తూము వద్ద ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి గండి వద్ద పోశారు. నీళ్లు వృథాగా పోకుండా చర్యలు తీసుకున్నారు.

కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన

జఫర్‌గఢ్: కాటమయ్య రక్షణ కవచం(సేఫ్టీ) మోకులపై మండలంలోని తిమ్మంపేట తాటివనంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వెంకటమల్లయ్య మాట్లాడుతూ.. తాటిచెట్లు ఎక్కుతున్నపుడు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు రవీందర్, వెంకటేశ్, సంతోశ్‌కుమార్, అంజయ్య, కార్తీక్, గీత కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజు, రాజమౌళి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రవీందర్



లింగాలఘనపురం: మండల తహసీల్దార్‌గా పి.రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన తహసీల్దార్ పి.వినయలత బదిలీపై వెళ్లారు.

బతుకమ్మ వేడుకలు



జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాలఘనపురం: జనగామ రెడ్డి కిట్టి సంఘం ఆధ్వర్యంలో బండ్లగూడెం బండగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు లింగారెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవాదుల కాలువలో పడి నాలుగు గేదెలు మృతి

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: అశ్వరావుపల్లి జలాశయం నుంచి నల్గొండ జిల్లాకు సాగునీరు అందించే దేవాదుల ప్రధాన కాలువలో పడి శుక్రవారం నాలుగు పాడి గేదెలు మృతిచెందాయి. వివరాలు ఇలా.. జాఫర్‌గూడెంకు చెందిన కావటి మహేందర్ ఆరు పాడిగేదెలు నీరు తాగేందుకు అటుగా వెళ్లి కాలువలో పడ్డాయి. రైతులు వాటిని రక్షించే ప్రయత్నం చేసినా, నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో కొట్టుకుపోయాయి. చివరకు రెండింటిని రక్షించగలిగారు. బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఉత్తమ సేవలకు సన్మానం

లింగాలఘనపురం: పరిశుభ్రతలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని జిల్లా పాలనాధికారి రిజ్వాన్‌బాషా సత్కరించారు. మండలంలోని వడ్డిచర్ల, గుమ్మడవెల్లి పంచాయతీ కార్యదర్శులు రమ్య, శ్వేత, జీడికల్ ఓపీఎస్ వి.మల్లేశ్, కార్మికులు నర్సయ్య (నెల్లుట్ల), మహేందర్ (ఏనెబావి), సత్యనారాయణ (మంథోనిగూడెం), మల్లమ్మ (వడ్డిచర్ల), జయమ్మ (నేలపోగుల)ను సత్కరించినట్లు ఎంపీడీవో జలందర్‌రెడ్డి తెలిపారు.

ఏర్పాట్లలో ఇబ్బందులు రానివ్వొద్దు



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట మైదానంతో పాటు బతుకమ్మ ఆడే అన్ని ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మకుంట మైదానంలో శుక్రవారం ఎమ్మెల్యే మార్నింగ్ వాకింగ్ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ పలు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగలకు బతుకమ్మకుంటను అన్ని వసతులతో తీర్చిదిద్దినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ...

తరిగొప్పుల: తరిగొప్పుల గ్రామానికి చెందిన భారాస సీనియర్ నాయకుడు కలకుంట్ల వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో భారాస మండలాధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో పూజలు



పాలకుర్తిలో..

పాలకుర్తి, దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవ పూజలు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పండితులు, అర్చకులు చండీ యాగం, హోమాలు జరిపారు. అలాగే తొర్రూరులో గురువారం ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అతిథిగా హాజరైన పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఝాన్సీరెడ్డి స్టేజీ కూలి కాలువిరగడంతో ఆమె త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు జరిపారు. పార్టీ బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండలాధ్యక్షుడు కుమారస్వామి, నేతలు పాల్గొన్నారు. అలాగే దేవరుప్పుల మండలంలోని కడవెండిలోని వానకొండ లక్ష్మీనరసింహ ఆలయంలో నాయకులు పూజలు జరిపించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నల్ల శ్రీరాం, నాయకులు రెడ్డిరాజుల రమేష్, తోటకూరి వెంకన్న, సజ్జన్‌నాయక్, శంకర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొడకండ్ల, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం అనంతారం నుంచి అక్రమంగా కొడకండ్లకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు కొడకండ్ల ఎస్సై రాజు తెలిపారు. ఇసుక తరలిస్తున్న వాహన యజమాని బేతి రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమ ఇసుక తరలింపులకు పాల్పడితే చర్యలు తప్పవని చర్యలు తప్పవని ఎస్సై పేర్కొన్నారు.

నాలాల ఆక్రమణలపై ఫిర్యాదు

జనగామ, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట నాలాలను దుకాణదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతూ అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం పట్టణ కమిటీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై శుక్రవారం జనగామ మున్సిపల్ కమిషనర్‌కు సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, జిల్లా కమిటీ సభ్యుడు బూడద గోపి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట రహదారిలో జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన నాలాల ఆక్రమణను ఉదహరించారు. వర్షాలకు కాల్వలు పొంగి, మురుగు, వరద నీరు రహదారులపైకి చేరుతోందని, తక్షణం చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగించాలని కోరారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

జనగామ టౌన్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం పట్టణంలోని క్రిస్టియన్ పాఠశాలలో విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం పరిశీలన ప్రక్రియను జిల్లా విద్యాధికారి కె.రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం ధ్రువపత్రాల పరిశీలనకు చివరి రోజని చెప్పారు. ఇప్పటి వరకు హాజరు కాని అభ్యర్థులంతా తప్పకుండా చివరి రోజు హాజరు కావాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

జనగామ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని పసరమడ్ల పరిధి చంపక్‌హిల్స్‌లో మాతృదర్శన్ ట్రస్టు, శరత్ మాక్స్ విజన్ ఐకేర్ హాస్పిటల్-వరంగల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో పసరమడ్ల, శామీర్‌పేట, ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామాలకు చెందిన 120 మంది గ్రామస్థులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోగా వారికి ఆరోగ్య నివేదికలు సమర్పించారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు రమేశ్‌రెడ్డి, వైద్య నిపుణులు సతీశ్, సిధు, యాకుబ్ పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం చెల్లించండి

నర్మెట్ట(తరిగొప్పుల), న్యూస్‌టుడే: వర్షానికి పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రమేష్ అన్నారు. శుక్రవారం నర్మెట్ట మండల పరిధిలోని తెట్టకుంటతండాలో పంట పొలాలను సేవాలాల్ సేన ప్రతినిధులు పరిశీలించి, మాట్లాడారు. సంఘం ప్రతినిధులు పవన్‌కళ్యాణ్, శ్రీకాంత్, రవి కుమార్, రవీందర్, తిరుపతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి దుస్తులు అందజేత

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు.

వివరాల నమోదులో పారదర్శకత అవసరం



జనగామ: పెద్దతండా(వై)లో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డుల పంపిణీ కోసం చేపట్టిన సర్వేలో ప్రతి ఇంటి వివరాలు నమోదు చేయాలని జిల్లా పాలనాధికారి రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. జనగామ మండలం పెద్దతండా(వై) గ్రామంలో చేపట్టిన సర్వేను జిల్లా కలెక్టర్ శుక్రవారం పరిశీలించి, మాట్లాడారు. గ్రామంలో ఏ ఒక్క కుటుంబం వివరాలు మరిచిపోకుండా నమోదు చేయాలని, ఇందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జడ్పీ సీఈవో సరిత, ఎంపీడీవో సంపత్‌కుమార్, గ్రామ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

సోమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



పాలకుర్తి, న్యూస్‌టుడే: సోమేశ్వరాలయంలో శుక్రవారం భక్తులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో ఆలయ పరిసరాలు భక్తుల రాకతో కిటకిటలాడాయి. దర్శనానికి అర గంట సమయం పట్టగా, బారులు తీరారు. అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో గాయపడ్డ పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌ఛార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండలాధ్యక్షుడు కుమారస్వామి, నేతలు రాఘవరావు, భైరు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



బహుమతులు అందిస్తున్న న్యాయమూర్తి సుచరిత

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులంతా సంప్రదాయ దుస్తులను ధరించి వివిధ రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి ఉయ్యాల పాటలు, కోలాటాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత మాట్లాడుతూ.. అలనాటి పండగలు, ఆచారాలను నేటి తరం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్వర్టుకు దిమ్మెలు కరవు

జనగామ-హుస్నాబాద్ ఆర్అండ్‌బీ రహదారిపై వడ్లకొండ గ్రామ పరిధిలో వాగుపై కల్వర్టుకు ఇరు వైపులా నిర్మించిన సైడ్ బర్మ్ దిమ్మెలు శిథిలమై సగానికి పైగా కూలిపోయాయి. నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు ఉద్ధృతంగా ప్రవహించడంతో ఓ కారు కొట్టుకుపోయిన ఘటనలో నలుగురు యువకులు దిమ్మెల వల్ల తృటిలో తప్పించుకున్నారు. వాటిని మళ్లీ పునర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈ అశోక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. – జనగామ రూరల్, న్యూస్‌టుడే



ప్రభుత్వ భూమిని రక్షించాలని వినతి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని సాల్వాపూర్ గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి కబ్జా చేస్తున్నారని శుక్రవారం తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఓ సర్వేనంబరు ఉన్న 29ఎకరాల 30గుంటల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి, స్థానిక రైతులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపించి, ఆధీనంలోకి తీసుకోవాలని గ్రామస్థులు శ్రీధర్‌గౌడ్, వెంకట్, అయిలయ్య, సురేశ్, నర్సింహులు, బాల్‌నర్సయ్య, తదితరులు విన్నవించారు.

వర్గీకరణపై కాలయాపన సరికాదు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రంలో కమిటీ పేరుతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, రాగల్ల ఉపేందర్ అన్నారు. పట్టణంలోని ఓ వేడుకల మందిరంలో శుక్రవారం కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు మాదిగలకు దక్కకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాలలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఉద్యోగ నియామక ప్రక్రియలన్నీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 9న నిర్వహించనున్న నల్ల జెండాల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పైస రాజశేఖర్, రాజు, యాదగిరి, ఉదయ్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

'రైతులను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం'

తరిగొప్పుల, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శుక్రవారం తరిగొప్పుల గ్రామంలో సీపీఎం గ్రామశాఖ మహాసభను ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. కర్షక, కార్మిక చట్టాలను కేంద్రం ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కావాలన్నారు. పార్టీ నేతలు భూక్య చందు, చింతల బుచ్చయ్య, అంజయ్య, నర్సయ్య, రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు



జనగామ, న్యూస్‌టుడే: తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం 2024-25 సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లిగారి మధు ఆధ్వర్యంలో కార్యాలయ వివిధ విభాగాల ఉద్యోగులు సభ్యత్వాన్ని స్వీకరించినట్లు ఆయన తెలిపారు. టీఎన్జీవోస్ జేఏసీ ఛైర్మన్ ఖాజాషరీఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ రాములు, అంజయ్య, వానలేశ్వర్, నర్సయ్య, విజయలక్ష్మి, శరత్‌మోహన్ పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక చేయూత

జనగామ రూరల్, న్యూస్‌టుడే: 1986-86లో తమతో పదో తరగతి చదువుకున్న మిత్రుడు ఆర్థిక కష్టాల్లో ఉన్నాడని తెలుసుకొని స్నేహితులు చేయూతనందించిన సంఘటన జనగామ మండలం వెంకిర్యాలలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన సత్తయ్య నర్మెట్ట ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. అతడి భార్య గత పది రోజుల కింద మృతి చెందడంతో బాల్య మిత్రులంతా కలసి రూ.70వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు గోపగాని శోభన్‌బాబు, నాగంపల్లి శ్రీనివాస్, ఎండి.జావీద్, మల్లాడి శ్రావణ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమం తప్పదు



ప్రసంగిస్తున్న ఇర్రి అహల్య

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: సమాజంలో సగభాగంకు పైగా ఉన్న మహిళల హక్కులు, సమస్యలు కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐద్వా జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. శుక్రవారం బచ్చన్నపేట అతిథిగృహంలో మండల మహాసభ నిర్వహించి, మాట్లాడారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలపై ఎన్నో దాడులు, హత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మానెపల్లి నిర్మల, ప్రతినిధులు కావ్య, మమత, నవనీత పాల్గొన్నారు.

చేనేత శిక్షణ కేంద్రం ప్రారంభం

జనగామ, న్యూస్‌టుడే: కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వీవర్స్ కాలనీలో మహిళలకు చేనేత వృత్తి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర చేనేత అభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలతో శుక్రవారం శిక్షణ శిబిరాన్ని, కార్యక్రమ బాధ్యుడు డాక్టర్ అరుణ్‌కుమార్ ప్రారంభించారు. శిక్షణార్థులకు రోజు భత్యం రూ.300 చొప్పున చెల్లిస్తారని వివరించారు. అందివచ్చిన అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని చేనేత సంఘ నాయకుడు శ్రీరాం శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో శిక్షకులు కోడం నర్సింహులు, బిర్రు సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు బి.నాగరాజు, వి.యుగేందర్‌లు పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమ ఏర్పాటుకు డిమాండ్



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని వీవర్స్ కాలనీలో అధిక సంఖ్యలో బీడీ కార్మికులున్నారని, ప్రభుత్వం కాలనీలో బీడీ పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని 11, 12వ వార్డుల్లో శుక్రవారం నిర్వహించిన మహాసభలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ వరలక్ష్మి, కల్యాణం లింగం, వెంకటేష్, సుధాకర్, పద్మ, లలిత, అరుణ, రేణుక పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు సన్మానం

దేవరుప్పుల రూరల్: దేవరుప్పుల మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు, ఎంపీవో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు దక్కాయి. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పంచాయతీ కార్మికులు భిక్షపతి, యాకయ్య, రామచంద్రు, భిక్షమయ్య ఎంపీవో సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు శివారెడ్డి, అంజలిని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఘనంగా సన్మానించి ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.